# ఇద్దత్ (గడువు) ఆదేశాలు

**134వ అంశం : వయసు మీదపడిన కారణంగా ముట్లుడిగిన మహిళల విడాకుల గడువు (ఇద్దత్) మూడు నెలలు.**

**135వ అంశం : పిన్న వయస్సు మూలంగా బహిష్టు (రజస్వల) అవని మహిళల విడాకుల గడువు కూడా మూడు నెలలే.**

**136వ అంశం : గర్భవతులైనవారి విడాకుల గడువు ప్రసవం. అది కొన్ని రోజులూ కావచ్చు, కొన్ని వారాలు లేక నెలలైనా కావచ్చు.**

"మీ స్త్రీలలో ముట్టుపై ఆశ వదులుకున్నవారి విషయంలో మీకేదైనా సందేహముంటే, వారి గడువు మూడు నెలలు. రజస్వల (రుతుస్రావం మొదలు)కాని వారి గడువు కూడా అంతే. గర్భవతుల గడువు వారి ప్రసవం అయ్యే వరకూ ఉంటుంది. ఎవడు అల్లాహ్‌కు భయపడతాడో అతనికి అల్లాహ్ అతని వ్యవహారంలో అన్ని విధాలా సౌలభ్యం కల్పిస్తాడు."

(అత్ తలాఖ్-4)

**137వ అంశం : ఇద్దత్ (గడువు) పూర్తి కానంతవరకూ స్త్రీ పునర్వివాహం చేసుకోజాలదు**

"మీరు స్త్రీలకు విడాకులు ఇచ్చిన తరువాత, వారు తమ గడువు (ఇద్దత్)ను ముగించి, తమ (మాజీ) భర్తలను ధర్మబద్ధంగా పరస్పరం ఇష్టపడి వివాహమాడదలిస్తే మీరు వారికి అడ్డుతగలకండి. మీలో ఎవరయితే అల్లాహ్‌ను, అంతిమ దినాన్నీ విశ్వసిస్తున్నారో వారికి ఈ ఉపదేశం చేయబడుతోంది. ఇందులోనే మీ పరిశుద్ధత, పరిశుభ్రత ఇమిడి ఉన్నాయి. అంతా అల్లాహ్‌కు తెలుసు, మీకు తెలియదు."

(అల్ బఖర -232)

**138వ అంశం : తలాఖె రజ్‌యీ ఇచ్చిన భార్యను ఇద్దత్ కాలంలో భర్త తన వెంటనే ఉంచాలి**

**139వ అంశం : తలాఖె రజ్‌యీ ఇచ్చిన భార్య పోషణాభారం ఆమె భర్తపైనే ఉంటుంది**

"మీ స్థోమత మేరకు మీరు ఉండే చోటే (విడాకులు పొందిన) ఆ మహిళలను కూడా ఉండనివ్వండి. వారిని ఇబ్బందులపాలుచేసే ఉద్దేశంతో బాధించకండి. ఒకవేళ వారు గర్భవతులై ఉంటే, వారు శిశువును కనేవరకూ వారికి ఖర్చులు ఇస్తూ ఉండండి. ఆ తరువాత వారు - మీ అభ్యర్థనపై- బిడ్డకు పాలిచ్చినట్లయితే వారికి వారి ప్రతిఫలాన్ని ముట్టజెప్పండి. ధర్మానుసారం

teluguislam.net



పరస్పరం సంప్రతించుకోండి. ఒకవేళ మీరు పరస్పరం గొడవ పడినట్లయితే అతని కోరికపై మరొకామె బిడ్డకు పాలుపడుతుంది." (అత్ తలాఖ్-6)

## 140వ అంశం : గర్భవతి కాని మహిళ, సమాగమం జరుపబడిన మహిళ విడాకులు పొందితే ఆమె గడువు (ఇద్దత్) కాలం మూడు రుతువులు

వివరణ : 11వ అంశాన్ని పేజి 39లో చూడండి.

## 141వ అంశం : భర్త తాకకుండానే విడాకులిచ్చిన మహిళకు ఏ విధమైన గడువు (ఇద్దత్) లేదు

వివరణ : 24వ అంశాన్ని పేజి 41లో చూడండి.

## 142వ అంశం : భర్త చనిపోయిన స్త్రీ సంతాప గడువు (ఇద్దత్) నాలుగు మాసాల పది రోజులు

హజ్రత్ ఉమ్మె అతియా (ర.అ) కథనం : మహనీయ ముహమ్మద్ (స) ప్రవచనం- "ఏ స్త్రీ కూడా మృతుని కొరకు మూడు రోజులకన్నా ఎక్కువ శోకం పాటించకూడదు-తన భర్త కోసం తప్ప. అతని (భర్త) కోసం నాలుగు మాసాల పది రోజులపాటు గడువు ఉంది. ఈ గడువు (ఇద్దత్) కాలంలో స్త్రీ రంగరించబడిన వస్త్రం ధరించరాదు. అది ముందు నుంచే రంగు గలదైతే తప్పులేదు. ఇంకా (ఈ గడువు కాలంలో) ఆమె కాటుక పెట్టుకోవటంగానీ, సుగంధ ద్రవ్యం వాడటం గానీ చేయరాదు. అయితే బహిష్టు స్థితి తొలగినప్పుడు, బహిష్టు రక్తపు దుర్వాసనను దూరం చేయటానికి (సాధారణమైన) సువాసనగానీ, అజ్ఫార్ (అనబడే) ద్రవ్యంగానీ ఉపయోగించవచ్చు." దీనిని ముస్లిం పొందుపరిచారు.[1]

## 143వ అంశం : 'ఖులా' పొందిన మహిళ గడువు ఒక రుతుకాలమే

వివరణ : 109వ అంశం క్రింద ఉన్న హదీసును పేజి 67లో చూడండి.

## 144వ అంశం : భర్త చనిపోయిన స్త్రీ ఇద్దత్ (గడువు) కాలం ఎట్టి పరిస్థితిలోనూ తన భర్త ఇంట్లోనే గడపాలి

## 145వ అంశం : తప్పనిసరి పరిస్థితిలో బయటికి వెళ్ళవచ్చుగాని రాత్రయ్యేసరికి ఇంటికి తిరిగి వచ్చేయాలి

---

*1. ముఖ్తసర్ సహీహ్ ముస్లిం లిల్ అల్బానీ-హ.నెం.864*

హజ్రత్ జైనబ్ బిన్తె కాబ్ బిన్ ఉజ్రా (ర.అ.) కథనం : హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) సోదరి ఫరైఅ బిన్తె మాలిక్ బిన్ సనాన్ (రఅ) తనతో ఏమని చెప్పిందంటే, తాను దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి, "నేను ఖుద్రా తెగవారి వద్దకు నా పుట్టింటికి వెళ్ళగలనా? ఎందుకంటే నా భర్తగారు పారిపోయిన బానిసలను వెతకటానికి వెళ్ళారు. ఆయన (మదీనా నగరానికి ఏడు మైళ్ళ దూరాన ఉన్న) 'ఖుదూమ్' వద్దకు వెళ్ళగానే బానిసలు కనిపించారు. కాని వాళ్ళు ఆయన్ని చంపేశారు. నేను నా పుట్టింటికి వెళ్ళగలనా? ఎందుకంటే నా భర్త నాకే ఆధారం గానీ, మనోవర్తిగానీ వదలలేదు" అని విన్నవించుకుంది. "సరే. వెళ్ళు" అని దైవప్రవక్త (స)తనతో చెప్పారని ఫరైఅ (రఅ) తెలిపారు. "నేను అక్కడి నుంచి బయలుదేరాను. అప్పటికింకా మస్జిద్‌లోనో, కుటీరంలోనో ఉన్నాను. దైవప్రవక్త (స) నన్ను (మళ్లీ) పిలిచారు లేదా ఎవరిచేతనో పిలిపించారు. లేదా నేను రప్పించబడ్డాను- "అవును, (ఇందాక) నువ్వేమన్నావు?" అని ప్రవక్త(స). అడిగారు. అంతకు ముందు చెప్పిందంతా మళ్లీ చెప్పాను. అప్పుడు దైవప్రవక్త (స) "ఇద్దత్ కాలం పూర్తయ్యేవరకూ నీ ఇంట్లోనే ఉండు" అని ఆదేశించారు. అందువల్ల నేను ఆ ఇంట్లోనే నాలుగు మాసాల పదిరోజుల వరకూ ఉండిపోయాను. హజ్రత్ ఫరైఅ (రఅ) ఇలా అంటున్నారు- హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) ఖలీఫా అయినప్పుడు నా దగ్గరకు సందేశం పంపి ఈ సమస్య గురించి విచారణ జరిపారు. నా పట్ల జరిగినదంతా నేను వివరించగా, దాని ప్రకారమే ఆయన తీర్పు ఇచ్చారు. (అబూదావూద్-2300. సహీహ్ హదీసు)[1]

## 146వ అంశం : కనబడకుండా పోయిన భర్తకోసం భార్య నాలుగేళ్ళు నిరీక్షించిన మీదట ఇద్దత్ పాటించి పునర్వివాహం చేసుకోవచ్చు

హజ్రత్ సాద్ బిన్ ముసయ్యబ్ (రజి) కథనం: హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) కనబడకుండా పోయిన భర్త యొక్క భార్య గురించి ఇలా అన్నారు - "ఆమె నాలుగు సంవత్సరాలు ఎదురు చూడాలి. ఆ తరువాత నాలుగు మాసాల పదిరోజులపాటు ఇద్దత్ పాటించి (తాను కోరితే) రెండో వివాహం చేసుకోవచ్చు." - దీనిని మాలిక్ పొందుపరిచారు.[2]

1. సహీహ్ సుననె అబీదావూద్ లిల్ అల్‌బానీ-రెండవ భాగం, హ.నెం.2016
2. కితాబుత్తలాఖ్ -నాల్గవ భాగం 1052, పేజి నం. 180.